


ఇద్దరూ కలిసి గిన్నెలు కడుగుతున్నారు– ఆమె కడుగుతుంటుంటే అతను వాటిని తుడిచిపెడుతున్నాడు. అంతకుముందు రాత్రి కడగడం అతను చేసాడు. అతనికి తెలిసినవాళ్లలో చాలామందిలాగా కాకుండా, అతను ఇంటిపనుల్లోకి చొరబడతాడు. కొన్నినెలల క్రితం తన భార్య స్నేహితురాలొకామె, ఇలాంటి భర్త ఉన్నందుకు తన భార్యని అభినందించడం కూడా విన్నాడు. *ప్రయత్నమైతే చేస్తుంటాను* అనుకున్నాడు. ఆపేక్ష ఉందని చూపించడానికి ఒక మార్గంగా అంట్లు తోమడంలో సహాయం చేయడం అతను ఎంచుకున్న పద్ధతి.

వాళ్లు అవీ ఇవీ మాట్లాడుకుంటూ– తెల్లవాళ్లు నల్లవాళ్లని పెళ్లిచేసుకోవాలా అన్న అంశం దగ్గరికి వచ్చారు మాటల మధ్యలో. అన్ని అంశాలనీ పరిశీలించి చూడగా, అది అంత గొప్ప ఐడియా ఏం కాదన్నాడు అతను.

“ఎందుకు?” అని అడిగింది ఆమె.

ఒక్కోసారి భార్య మొహం మీద– కనుబొమలు ముడిపడి, కింద పెదవి కొరుక్కుంటూ దేన్నో చూస్తున్నట్టు ఉండే ఒక వైఖరి కనిపిస్తుంటుంది. ఇప్పుడు సరీగ్గా అలాంటిదే కనిపించేటప్పటికి, ఇక నోరుమెదపకపోవడం శ్రేయస్కరం అనుకున్నాడు; కానీ ఆచరణలో విఫలమయ్యాడు. నిజానికి ఇంకా ఎక్కువ మాట్లాడటం మొదలుపెట్టాడు. ఆమె ముఖంలో ఇప్పుడా భావం బాగా స్థిరపడింది.

“ఎందుకు?” కడుగుతున్న గిన్నెని కడగటం ఆపేసి, అలాగే గిన్నెని పట్టుకుని నిలుచుని మళ్లీ అడిగింది.

“చూడూ, నల్లవాళ్లతో కలిసి నేను స్కూలుకి వెళ్లాను. ఉద్యోగం చేస్తున్నప్పుడూ వాళ్లతో కలిసి పనిచేసాను. వాళ్లుంటున్న వీధిలోనే వాళ్లతో కలిసిమెలిసే ఉన్నాను. ఇప్పుడు నువ్వొచ్చి నేను రేసిస్ట్‌ని అనే ధ్వని వచ్చేట్టు మాట్లాడొద్దు,” అన్నాడు.

“నేనే ధ్వనితోనూ మాట్లాట్టం లేదు,” అని కడగడం ఆపేసిన గిన్నెని అటూయిటూ తిప్పుతూ కడగటం మొదలుపెట్టింది, దానికేదో ఓ ఆకారం తీసుకురాబోతున్నట్టు. “ఒక తెల్లమనిషి ఇంకో నల్లమనిషిని పెళ్లిచేసుకుంటే అందులో నాకేమీ తప్పు కనిపించడం లేదు,” అంది.

“వాళ్లు మనలాగా ఒకే సాంస్కృతిక నేపథ్యం ఉన్నవాళ్లు కాదు. ఒకసారి వాళ్లు మాట్లాడుతుంటే విని చూడు– వాళ్లకంటూ వారిదే ఒక భాషకూడా ఉంది. అది నాకేం పర్లేదు, వాళ్లు మాట్లాడుతుంటే వినడం నాకు *ఇష్టం* కూడా”–నిజమే, ఎందుకోగానీ వాళ్ల మాటలు అతన్ని ఉత్సాహపరచేవి–“కానీ అది వేరు. వాళ్ల సంస్కృతినుంచి ఒక మనిషి, మన సంస్కృతినుంచి ఒక మనిషి ఒకళ్లని ఒకళ్లు నిజంగా *తెలుసుకోవడం* ఎప్పటికీ జరగదు.”

“నేను నీకు తెలిసినట్టుగానా?” భార్య అడిగింది.

“అవును, నువ్వు నాకు తెలిసినట్టు.”

ఓరి బాబోయ్ అనుకున్నాడు. “నేను చెప్పానని కాదు. స్టాటిస్టిక్స్ ఏం చెబుతున్నాయో చూడు. అలాంటి పెళ్లిళ్లు చాలా వరకు విఫలమవుతున్నాయి.”

“స్టాటిస్టిక్స్.” కడిగిన గిన్నెల్ని ఇలా తుడిచేసి అలా గట్టుమీద శరవేగంతో పెట్టేస్తోంది ఆమె. చాలా గిన్నెలు

ఇంకా జిడ్డుగానే ఉన్నాయి. ఫోర్క్స్ పళ్లమధ్య ఆహారపు తునకలు అక్కడక్కడా ఇంకా అలానే ఉన్నాయి. "సరే, ఫారినర్స్ సంగతేమిటి? ఇద్దరు ఫారినర్స్ పెళ్లిచేసుకున్నా ఇంతే అంటావా?"

"అవును," అన్నాడు, "అలానే అనుకుంటున్నాను నిజానికి. అసలు ఒక పూర్తి విభిన్నమైన నేపథ్యంనుంచి వచ్చినవాళ్లని నువ్వెలా అర్థం చేసుకోగలవు?"

"విభిన్నమైనవి," అంది ఆమె. "ఒకటే కాదు, మనలాగా."

"అవును, విభిన్నమైన." అని చురుగ్గా అన్నాడు. తన మాటల్నే తనకి తిరిగి అప్పగిస్తుంటే కోపం వచ్చింది అతనికి. అవేవో తెలివితక్కువ మాటలైనట్టు. "ఇవన్నీ ఇంకా జిడ్డుగానే ఉన్నాయి," అంటూ గిన్నెలన్నీ మళ్లీ సింక్‌లో పడేసాడు.

నీళ్లు కొంచెం మురిగ్గా కనిపిస్తున్నాయి. దానివైపు పెదాలు బిగించి చూస్తూ, నీళ్లల్లో చేతులు పెట్టింది. "ఓ.." అంటూ అరుస్తూ వెనక్కి గెంతింది. కుడిచేతిని పట్టుకుని పైకెత్తింది. బొటనవేలినుంచి రక్తం కారుతోంది.

"కదలొద్దు, అలానే ఉండు యాన్," అన్నాడతను. పరిగెత్తుకుంటూ పైన బాత్‌రూమ్‌కి వెళ్లి స్పిరిట్, దూది, బాండ్-ఎయిడ్ తీసుకుని వచ్చాడు. అతను తిరిగొచ్చేటప్పటికి చెయ్యి అలానే పట్టుకుని, కళ్లుమూసుకుని ఫ్రిడ్జ్‌కి ఆనుకుని నిలుచుని ఉంది. ఆమె చేతిని తీసుకుని, వేలిమీద దూదితో అదిమిపెట్టాడు. రక్తస్రావం ఆగింది. గాయం లోతుగా అయిందా అని చూడటానికి బొటనివేలిని అదిమిపెట్టి చూసాడు. ఒక ఎర్రటి రక్తపుబొట్టు కొత్తగా ఊరి, నేలమీద పడింది. నిందిస్తున్నట్టుగా ఆమె అతనివైపు చూసింది. "చిన్నదే. రేప్పొద్దుటికి అసలు గాయం అయిన సంగతి కూడా తెలీదు," అన్నాడు. తను ఎంత వేగంగా స్పందించాడో దాన్ని అభినందిస్తుందేమోనని చూసాడు. ఆమె పట్ల ఇష్టంతోనే చేసాడు, ఈ మెచ్చుకోలు మాటలకోసం కాదు. ఇక ఇప్పుడైనా ఆమె ఆ పాత సంభాషణని పునఃప్రారంభించకుండా ఉంటే బాగుండనుకున్నాడు. అలసటొచ్చేసింది. "ఇక్కడ పని నేను పూర్తిచేస్తాన్లే, నువ్వెళ్లి విశ్రాంతి తీసుకో," అన్నాడు.

"పర్లేదు, నేను తుడుస్తానులే," అంది.

గిన్నెల్ని మళ్లీ కడగడం మొదలుపెట్టాడు అతను– ఈసారి ఫోర్క్స్ మీద మరింత శ్రద్ధ పెడుతూ.

"సో, నేను నల్ల అమ్మాయిని అయివుంటే నన్ను పెళ్లిచేసుకునేవాడివి కాదన్నమాట," అంది.

"అబ్బా, యాన్!"

"మరే, నువ్వన్నది అదే, కాదా?"

"లేదు, నేననలేదు. అసలు ఆ ప్రశ్నే హాస్యాస్పదంగా ఉంది. నువ్వు నల్ల అమ్మాయివి అయితే అసలు మనం కలుసుకుని ఉండేవాళ్లమే కాదు. నీకు నీ స్నేహితులూ, నాకు నా స్నేహితులూ ఉండేవారు."

"ఒకవేళ మనం కలుసుకుని ఉంటే, నేను నల్ల అమ్మాయిని అయివుంటే?"

"అప్పుడు నువ్వు ఏ నల్లవాడితోనో తిరుగుతూ ఉండివుంటావు." నాజిల్ తీసుకుని గిన్నెలమీద స్ప్రే చేసాడు. నీళ్లు ఎంత వేడిగా ఉన్నాయంటే, నీళ్లు పడ్డ మేర గిన్నె లేతనీలం రంగులోకి మారి, మళ్లీ గిన్నె రంగులోకి వస్తోంది.

"లేదనుకుందాం." అంది. "నేను నల్ల అమ్మాయిని, ఎవరితోనూ తిరగడం లేదు అనుకుందాం. మనం కలుసుకున్నాం, ప్రేమలో పడ్డాం."

ఆమెవైపు చూసాడు. ఒకలాంటి మెరుపుకళ్లతో అతన్నే చూస్తోంది.

"చూడూ, అది అర్థరహితమైన వాదన," అన్నాడు గొంతులో మృదుత్వాన్ని నింపుకుంటూ. "నువ్వు నల్ల అమ్మాయివే అయితే, నువ్వు నువ్వు కాదు," అన్నాడు. అంటున్నప్పుడే అందులోని సత్యం కూడా అతనికి గోచరించింది. తను నల్ల అమ్మాయే అయితే, తను ఇక తను కాదు అనే విషయం గురించి వాదన పొడిగించగల అవకాశమే లేనట్టయింది. అందుకని మళ్లీ అన్నాడు: "నువ్వు నలుపయితే, నువ్వు నువ్వు కాదు."

"తెలుసు, అయినా అనుకుందాం."

గాఢంగా ఊపిరితీసుకున్నాడు. తను ఈ వాదంలో నెగ్గినట్టే కానీ, సమాధానాలు చెప్పవలసిన పరిస్థితుల్లో ఇరుక్కున్నట్టుగా ఫీలయ్యాడు. "ఏమనుకుందాం?" అని అడిగాడు.

"నేను నల్ల అమ్మాయినే కానీ, నేను నేనే. మనం ప్రేమించుకున్నాం. నన్ను పెళ్లిచేసుకుంటావా?"

అతను దీనిగురించి కొంచెం ఆలోచించాడు.

"ఏంటి?" అంటూ అతని దగ్గరగా వచ్చింది. ఆమె కళ్లల్లో ఇంకొంచెం మెరుపు. "నన్ను పెళ్లిచేసుకుంటావా?"

"ఆలోచిస్తున్నాను," అన్నాడు.

"చేసుకోవు– నేను చెప్పగలను. నో అనబోతున్నావు నువ్వు."

"అంత తొందరొద్దు. ఆలోచించవలసిన విషయాలు చాలా ఉన్నాయి. జీవితాంతం చింతించవలసిన పనులు చేయడానికి ఇష్టపడం కదా..."

"ఇంకా ఆలోచించడాల్లేవు. ఎస్ ఆర్ నో"

"నువ్వలా అంటున్నావు కాబట్టి–"

"ఎస్ ఆర్ నో."

"దేవుడా! సరే. నో."

"థాంక్యూ," అనేసి కిచెన్‌నుంచి హాల్లోకి వెళ్లిపోయింది. ఓ క్షణం తర్వాత ఏదో పత్రిక పేజీలు తిప్పుతున్న చప్పుడు విన్నాడు. పత్రిక చదివే వీలులేనంత కోపంగా ఉందని అతనికి తెలుసు. కానీ, అతను చేసినట్టుగా కోపంగా పేజీలు గబగబా తిప్పడం లేదు. పత్రికలోని ప్రతిమాటా చదువుతున్నంత నెమ్మదిగా పేజీలు తిప్పుతోంది. తన పట్ల ఉదాసీనతని ప్రదర్శిస్తోంది. అది కలగజేయవలసిన ప్రభావాన్ని కలగజేసేసింది. అది అతన్ని గాయపరచింది.

ఇప్పుడిక తనూ ఉదాసీనంగా ఉండటం తప్పించి మార్గాంతరం లేదు. నిశ్శబ్దంగా, శ్రద్ధగా మిగతా గిన్నెలన్నీ కడిగేసాడు. తుడిచేసి పక్కన పెట్టేసాడు. గట్టు, స్టవ్ శుభ్రంగా తుడిచేసి, నెత్తుటిబొట్టు పడ్డ ప్రదేశాన్ని శుభ్రం చేసేసాడు. ఇవన్నీ చేస్తున్నప్పుడే, ఫ్లోర్‌ని కూడా తడిబట్టతో తుడిచేద్దామని నిర్ణయించుకున్నాడు. ఆన్నీ అయిపొయ్యాక, కిచెన్ సరికొత్తగా–అసలు వీళ్లు ఈ ఇంటికి రావడానికి ముందున్నంత శుభ్రంగా– కనిపించింది.

చెత్త ఉన్న బ్యాగ్‌ని తీసుకుని బయటకు కదిలాడు. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంది; సిటీ లైట్ల వెలుగులు లేని పశ్చిమాన అక్కడక్కడా చుక్కలు కనిపిస్తున్నాయి. ఎల్

కమీనో రోడ్డుమీద ట్రాఫిక్ పల్చగా ఉండి, నదిలా ప్రశాంతంగా కదులుతోంది. ఇలాంటి వివాదంలోకి ఆమె తనని లాగేలా చేసినందుకు కొంచెం సిగ్గుగా అనిపించింది. ఇంకో ముప్పై యేళ్ల తర్వాత ఇద్దర్లో ఎవరూ ఉండరు. అలాంటప్పుడు, ఇలాంటివన్నీ దేనికి? తాము కలిసివున్న ఇన్ని సంవత్సరాల గురించీ, తాము కలిసి గడిపిన క్షణాల గురించీ, తామెంత అన్యోన్యంగా ఉన్నదీ ఆలోచించుకున్నాడు. గొంతులో ఏదో అడ్డం పడి, ఊపిరి తీసుకోవడం కష్టమైనట్టయింది. ముఖమూ, మెడలమీద ఒక జలదరింపు. గుండెల్లోకి ప్రేమ ఎగదన్నుకొచ్చింది. ఈ ప్రకంపనాలన్నీ కొన్ని క్షణాలపాటు అనుభవించి, చెత్త తీసుకుని వెనక గేటునుంచి బయటకు వెళ్లాడు.

చెత్తతొట్టి దగ్గర రెండు వీధికుక్కలున్నాయి. ఒకటి నేలమీదపడి పొర్లుతోంది; రెండోదాని నోట్లో యేదో ఉంది. అతను రావడం చూసి, నెమ్మదిగా అక్కణ్ణుంచి కదిలాయి. మామూలుగా అయితే ఏ రాయో విసిరి వాటిని తరిమేసేవాడు కానీ, ఈసారి వాటి మానాన వాటిని పోనిచ్చాడు.

ఇంటికి తిరిగివచ్చేటప్పటికి ఇల్లంతా చీకటిగా ఉంది. ఆమె బాత్‌రూమ్‌లో స్నానం చేస్తోంది. బయట తలుపుదగ్గర చేరి ఆమెని పేరుపెట్టి పిలిచాడు. లోపల చప్పుళ్లవుతున్నాయి కానీ, ఆమె జవాబివ్వలేదు. "యాన్, నేను నిజంగా సారీ," అన్నాడు. "మామూలుగా అయిపోతాను, ప్రామిస్."

"ఎట్లా?" అడిగింది.

ఈ ప్రశ్న ఊహించలేదతను. వింతగా అనిపిస్తున్న ఆమె గొంతులోని ధ్వని, స్థాయి, ఒక ప్రత్యేకమైన స్వరస్థానాన్ని బట్టి, తను సరైన సమాధానం ఇవ్వాలని అర్థమైంది అతనికి. తలుపుకి ఆనుకుని, "నిన్ను పెళ్లిచేసుకుంటాను," అన్నాడు గుసగుసగా.

"చూద్దాం," అంది. "నువ్వు పడుకొని ఉండు, ఒక్క నిమిషంలో వస్తాను."

బట్టలు విప్పేసి, దుప్పటి కప్పుకుని పడుకున్నాడు. బాత్‌రూమ్ తలుపు తెరుచుకుని, మూసుకోవడం వినిపించింది.

"లైట్ తీసేయ్," అంది.

"ఏంటీ?"

"లైట్ తీసేయి."

పక్కకి ఒత్తిగిలి, బెడ్ పక్కనున్న లైట్‌కి ఉన్న చైన్ లాగాడు. గది మొత్తం చీకటి పరుచుకుంది. "ఆల్‌రైట్," అన్నాడు. అలానే పడుకుని ఉన్నాడు, కానీ ఏమీ జరగలేదు. "ఆల్‌రైట్," అని మళ్లీ అన్నాడు. రూమ్‌లో అటునుంచి ఇటు ఏదో కదిలిన శబ్దం వినిపించింది. లేచి కూచున్నాడు, కానీ ఏమీ కనిపించడం లేదు.

రూమ్ నిశ్శబ్దంగా ఉంది. వాళ్లిద్దరి మొదటిరాత్రినాడు కొట్టుకున్నట్టుగా గుండె కొట్టుకుంది– ఇప్పటికీ మధ్యరాత్రిలో ఏదో చప్పుడుకి మెలకువ వచ్చినప్పుడు కొట్టుకునేట్టుగా.

ఇంట్లో ఎవరో తిరుగుతున్న శబ్దం.

ఎవరో ఒక కొత్తమనిషి.

★